ఉన్మాది ఘాతుకానికి గురైన విద్యార్థిని మృతి

- నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ ప్రజాసంఘాల ఆందోళన
- నిందితుడి అరెస్టు : ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి – బద్వేలు, కడప అర్బన్

ఉన్మాది చేతిలో పెట్రోల్ దాడికి గురైన ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మ (16) కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. బద్వేల్ శివారు ప్రాంతంలో ఉన్న సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమ సమీపంలో విఘ్నేష్ అనే యువకుడు మాట్లాడాలని పిలిచి ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. 80 శాతం కాలిన గాయాలతో ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. కొన ఊపిరితో ఉన్న దస్తగిరమ్మ మృతువుతో పోరాడి చివరికి ప్రాణాలు విడిచారు.

ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై పోలీసులు తక్షణం చర్యలు చేపట్టారని, బద్వేల్ పట్టణం రామాంజనేయనగర్‌కు చెందిన జక్కల విఘ్నేష్‌ను ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పట్టణ శివార్లలోని డిటిసి సమీపంలో బద్వేల్ రూరల్ సిఐ తన సిబ్బందితో కలసి అరెస్టు చేశారని తెలిపారు. దస్తగిరమ్మ తనను పెళ్లి చేసుకోవాలని తరచూ కోరుతుండేదని, ఆ ఒత్తిడిని తప్పించుకునేందుకు ముందస్తు ప్రణాళికతో ఆమెపై పెట్రోల్‌తో దాడి చేశానని విచారణలో విఘ్నేష్ వెల్లడించాడని ఎస్‌పి చెప్పారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నామని తెలిపారు.

నిందితుడికి త్వరితగతిన శిక్ష పడేలా సాక్ష్యాధారాలను సేకరించేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారని చెప్పారు. నిందితులను త్వరితగతిన అరెస్టు చేసిన కడప పోలీసులను డిజిపి అభినందించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ప్రజాసంఘాల డిమాండ్

విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కడప ఆర్‌టిసి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు ఐఎన్ సుబ్బమ్మ, డివైఎఫ్ఐ నాయకులు వీరణాల శివకుమార్, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు వీరపోగు రవి, బి దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, ఆమె ఇంట్లోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కడప నగరంలో ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు (ఇన్‌సెట్‌లో) విద్యార్థిని దస్తగిరమ్మ (ఫైల్)

మరణ శిక్ష విధించాలి

బాలిక మృతికి కారకుడైన విఘ్నేష్‌కు మరణ శిక్ష విధించాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక పట్టణ కన్వీనర్ కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరస్తుడిని పట్టుకోవడంలో కషి చేసిన పోలీసు అధికారులను అభినందించారు.

దిశా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

బాలికను అతి దారుణంగా చంపిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని, దిశా చట్టాన్ని అమలు చేయాలని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా డిమాండ్ చేశారు. వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విచారణ వేగవంతం చేసి నిందితులను త్వరగా శిక్షించినప్పుడే ఎవరైనా తప్పు చేయాలంటే భయం కలుగుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, వైసిపి నాయకులు సుందరరామిరెడ్డి, కరెంటు రమణారెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

- దస్తగిరమ్మ మృతి పట్ల సిఎం తీవ్ర విచారం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కడప జిల్లా బద్వేల్‌లో యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్రంగా గాయపడిన దస్తగిరమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై 'ఎక్స్' వేదికగా ఆదివారం స్పందిస్తూ.. ఎంతో భవిష్యత్తు ఉన్న ఒక విద్యార్థి దుర్మార్గుడి దుశ్చర్యకు బలికావడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ఈ ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం చేయడం అంటే... హంతకుణ్ని త్వరగా, చట్టబద్ధంగా శిక్షించడమేనన్నారు. ప్రత్యేక కోర్టులో ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారణ పూర్తి చేసి నేరస్తుడికి మరణశిక్ష స్థాయి శిక్ష పడేలా చూడాలని అధికారులకు సూచించారు. మహిళలు, ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి ఇది ఒక హెచ్చరికగా ఉండాలన్నారు. ఈ ఘటనపై తాను పోలీసు అధికారులతో మాట్లాడానని చెప్పారు.

మహిళలకు ఏమాత్రం భద్రత లేదని ఈ ఘటన సూచిస్తోంది : ఐద్వా

బద్వేల్ ఘటన చూస్తే.. రాష్ట్రంలో మహిళలకు ఏమాత్రం భద్రత లేదని స్పష్టం చేస్తోందని ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి పేర్కొన్నారు. ఘటనపై సిఎం తక్షణం స్పందించడం హర్షణీయమే అయినప్పటికీ ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయని, వీటిని అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటనేది స్పష్టం చేయాలని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళలు హింసకు గురికాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు. ఒకటి, అర కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పజెప్పడం, అరకొర సాయం ప్రకటించడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. నిందితుడు విఘ్నేష్ ఇప్పటికే వివాహమైనప్పటికీ బాధితురాలిని ప్రేమ పేరుతో వేధించాడని, ఆమె తిరస్కరించడంతో ఈ ఘటనకు పాల్పడ్డాడని చెప్పారు. మహిళలకు రక్షణ కల్పించడం, వారిపై అఘాయిత్యాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక కమిటీని వేయాలన్నారు. ఈ విషయాలపై గతంలో వర్మ కమిషన్ ఇచ్చిన సూచనలను అమలు చేయాలన్నారు. నిందితులు విఘ్నేష్‌తోపాటు అతని స్నేహితులు మరికొంత మంది టీనేజ్ అమ్మాయిలను లోబర్చుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నందున పోలీసులు ఈ కేసును మరింత లోతుగా విచారణ చేయాలని కోరారు. దోషిని కఠినంగా శిక్షించడంతోపాటు ఘటనలో మృతిచెందిన దస్తగిరమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేందుకు తక్షణ సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను : పురందేశ్వరి

బద్వేల్ ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, బాధితురాలు చికిత్స పొందుతూ మరణించడం బాధాకరమని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపి పురందేశ్వరి తెలిపారు. ఘటనపై 'ఎక్స్' వేదికగా ఆమె స్పందిస్తూ.. నేరస్తుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

హిందుస్థాన్ జింక్‌కు రూ.2,327 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : వేదాంత గ్రూపునకు చెందిన హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్‌ఎల్) 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో 34.5 శాతం వృద్ధితో రూ.2,327 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,729 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.7,014 కోట్లు ఉన్న ఆదాయం.. గడిచిన క్యూ2లో రూ.8,522 కోట్లకు పెరిగింది. రూ.6,403 కోట్ల జింక్ అమ్మకాలు చేయగా.. వెండి ఇతర సెగ్మెంట్ల నుంచి రూ.1,550 కోట్ల ఆదాయం సమకూరినట్లు వెల్లడించింది.

క్వాష్ పిటిషన్‌ను వాపస్ తీసుకున్న డిప్యూటీ సిఎం పవన్

ప్రజాశక్తి–అమరావతి

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ దాఖలైన పరువు నష్టం కేసును కొట్టివేయాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు నుంచి వాపస్ తీసుకున్నారు. క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటానని, అందుకు అనుమతించాలని పవన్ దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు పవన్‌కల్యాణ్‌పై గత ప్రభుత్వం పరువు నష్టం కేసు దాఖలు చేసింది. ఈ కేసును కొట్టేయాలంటూ ఈ ఏడాది జులైలో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తదుపరి చర్యలన్నీ హైకోర్టు గతంలోనే నిలిపివేసింది. పరువు నష్టం కేసులు అన్నింటినీ కూటమి ప్రభుత్వం ఉపసంహరణకు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో క్వాష్ పిటిషన్ వాపస్ తీసుకునేందుకు అనుమతించాలని పవన్.. హైకోర్టును ఆశ్రయించారు. జనసేన అధ్యక్షులు హోదాలో గత ప్రభుత్వంలో వలంటీర్లపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం పరువు నష్టం దావా దాఖలు చేసింది.



మృతిచెందిన గుర్తుతెలియని మహిళ

రైలులో ప్రయాణికురాలు మృతి

ప్రజాశక్తి – గుత్తి (అనంతపురం జిల్లా)

రైలులో ప్రయాణికురాలు మృతి చెందారు. ఈ విషయం అనంతపురం జిల్లా గుత్తిలో వెలుగులోకి వచ్చింది. గుత్తి జిఆర్‌పి ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల ప్రకారం... పూణె నుంచి కన్యాకుమారి వెళ్తున్న కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (16381) రైలులో ప్రయాణిస్తున్న ఓ గుర్తు తెలియని మహిళ ముక్కులో నుంచి రక్తం వస్తుండడంతో గమనించిన తోటి ప్రయాణికులు గుత్తి రైల్వే స్టేషన్‌లోని జిఆర్‌పి పోలీసులు, స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో, స్పందించిన సిబ్బంది వెంటనే గుత్తి రైల్వే ఆస్పత్రి వైద్యులకు తెలియజేశారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధ్రువీకరించారు. గుండె పోటుతో మృతి చెంది ఉంటుందని వైద్యులు తెలిపారు. జిఆర్‌పి పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళ ఆచూకీ కోసం ఆమె ఫొటోను అన్ని పోలీసు స్టేషన్లకు పంపారు. మృతురాలి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆమె వివరాలు తెలిస్తే ఫోన్ 6305073235 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఖాజీపేటలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మనోహర్

ఉచిత సిలిండర్లపై 23న నిర్ణయం

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి–తెనాలి (గుంటూరు జిల్లా)

ఉచిత గ్యాస్ సిలిండర్ల కేటాయింపు దీపావళి నుంచి ప్రారంభం అవుతుందని, ఇందుకు సంబంధించిన విధి విధానాలు ఈ నెల 23న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు అవుతాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలిలోని కాజీపేట, కరెవరం, ఎరుకలపూడి, అంగలకుదురు గ్రామాలలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి, పలు అభివద్ధి కార్యక్రమాలకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన సూపర్ సిక్స్‌లో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించనుందని తెలిపారు. దీపావళితో ప్రారంభమయ్యే ఈ పథకం ప్రతి కుటుంబంలోనూ వెలుగు నింపుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పథకం అమలుతో ప్రభుత్వంపై ఏడాదికి రూ.1000 కోట్ల వరకు భారం పడుతుందని తెలిపారు.

స్వచ్ఛభారత్ ప్రతిన

స్వచ్ఛభారత్‌లో భాగంగా విజయవాడలో సిఆర్ బిల్డింగ్స్ వద్ద ఆదాయపు పన్ను శాఖ నిర్వహించిన వాక్ మారథాన్ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న సినీనటుడు సుధీర్, పిఐబి అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజిందర్ చౌదరి తదితరులు

- ఫొటో టివి రమణ

మహిళలు, బాలికలకు రక్షణ కల్పించలేకపోతున్న ఇదేం రాజ్యం చంద్రబాబు ?

- వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కల్పించలేకపోతున్న ఇదేమి రాజ్యం చంద్రబాబూ? అంటూ వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రతిరోజూ ఏదో ఒకచోట అత్యాచారాలు, హత్యలు, వేధింపులు సర్వ సాధారణమైపోయాయని పేర్కొన్నారు. బద్వేలులో కళాశాల విద్యార్థినిపై పెట్రోల్ పోసి, నిప్పు పెట్టి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం, దుర్మార్గం అని పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం ఉందని ఆరోపించారు. వైసిపి మీద కక్ష పెట్టుకుని, తమ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలు, కార్యక్రమాలను ఎత్తివేస్తూ రాష్ట్రం, ప్రజల మీద కక్ష సాధిస్తుండటం అన్యాయం కాదా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో బాలికలు, మహిళల భద్రతకు పూర్తి భరోసానిస్తూ తీసుకొచ్చిన 'దిశ'ను ఉద్దేశపూర్వకంగా నీరుకార్చడం దీనికి నిదర్శనం కాదా? అని జగన్ ప్రశ్నించారు. దిశ ప్రారంభం మొదలు 31,607 మంది మహిళలు, బాలికలు రక్షణ పొందితే దాన్ని ఎందుకు దెబ్బతీశారు చంద్రబాబు అంటూ ఆయన ప్రశ్నించారు.

ప్రియతమ నేతకు అక్షర నివాళి
వెలువడినది
ప్రియతమ నేతకు అక్షర నివాళి
కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయం, లక్ష్యం తెలిపేందుకు ఆయన్ని స్మరించుకుంటూ వేసినదే ఈ అక్షర నివాళి పుస్తకం.
పేజీలు : 225/-
ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
ఫోన్ : 9490099057
బ్రాంచీలు
విశాఖపట్నం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు

సంఘటనాస్థలం వద్ద ధర్మవరం డిఎస్పీ శ్రీనివాసులు, తదితరులు

రామాపురంలో కాల్పుల కలకలం....

ప్రజాశక్తి – బత్తలపల్లి (శ్రీ సత్యసాయి జిల్లా)

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలంలోని రామాపురం బస్ స్టేజ్‌లో ఆదివారం కాల్పుల కలకలం రేగింది. ధర్మవరం డిఎస్‌పి శ్రీనివాసులు, ధర్మవరం సబ్ డివిజన్‌లోని సిఐలు, ఎస్ఐలు సిబ్బందితో గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డిఎస్‌పి శ్రీనివాసులు విచారించి వివరాల వెల్లడించారు. ఓ చోరీ కేసులో బీహార్‌కు చెందిన దొంగల ముఠా రామాపురం గ్రామ పరిసరాల్లో తలదాచుకొని సంచరిస్తున్నారని లోకేషన్ ఆధారంగా తెలంగాణ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో దొంగలు తప్పించుకునేందుకు యత్నించడంతో పోలీసులు కాల్పులు జరిపారు. దొంగలు అక్కడ నుంచి పరారయ్యారు. కాల్పుల ఘటనపై తొలుత కొంత గందరగోళం నెలకొంది.వెవరు ఎవరిపై కాల్పులు జరిపారో అర్థంకాక స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసుల ప్రకటనతో స్పష్టం వచ్చింది.

విద్యుదాఘాతంతో తల్లీకొడుకు మృతి

ప్రజాశక్తి – సామర్లకోట(కాకినాడ జిల్లా)

విదుదాఘాతంతో ఒక్క రోజు వ్యవధిలోనే తల్లీ కొడుకు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద సంఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... వీరరాఘవపురం గ్రామంలో చిట్టిమాని నూకరాజు, పద్మావతి దంపతులు కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారంనాడు పద్మావతి (44) బట్టలు ఉతికి తీగపై ఆరేస్తుండగా ఎదురుగా ఉన్న డ్రెయినేజీలో పడి మృతి చెందారు. శనివారమే ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం ఉదయం పద్మావతి కుమారుడు విశ్వేన్ (23) తన మేనత్తకు తల్లి మరణఘటనను వివరిస్తూ అక్కడే బట్టలు ఆరబెట్టే తీగను పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఇంట్లోని ఎర్త్ వైరు తెగిపడి ఉండటాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. దీనిగుండా విద్యుత్ ప్రవహించడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్టు గుర్తించారు. పద్మావతి కూడా ఇలాగే మరణించి ఉంటుందని తెలిపారు. ఒక్క రోజు వ్యవధిలోనే తల్లీ కొడుకుల ప్రాణాలు కోల్పోవడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పద్మావతి విశ్వేన్(ఫైల్)

ఉపాధి పథకంలో అంకుడు, తెల్లపాణికి మొక్కల పెంపకం

- పిఆర్‌అండ్ ఆర్‌డి డైరెక్టరు కృష్ణతేజ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు రూపొందించే హస్తకళల కళాకారులకు అవసరమైన అంకుడు, తెల్లపొణికి చెట్ల పెంపకం ఉపాధి పథకంలో చేపట్టేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిద్ధమైంది. ఈ మేరకు అధికారులకు ఆ శాఖ డైరెక్టరు కృష్ణతేజ ఆదేశాలు జారీ చేశారు. ఏటికొప్పాక బొమ్మల తయారీకి అంకుడు, కొండపల్లి బొమ్మల తయారీకి తెల్లపొణికి చెట్ల కర్రను ముడిసరుకుగా కళాకారులు వినియోగిస్తారు. ప్రస్తుతం ఈ చెట్ల లభ్యత తక్కువగా ఉండటంతో కళాకారులు ముడి సరుకుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాకారులు ఈ సమస్యను గతంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సూచనల మేరకు అధికారులు ఏటికొప్పాక, కొండపల్లి ప్రాంతాల్లో ప్రభుత్వ, అటవీ, సామాజిక స్థలాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ మొక్కలను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

జాయింట్ ఇ-వేలం అమ్మకం ప్రకటన

IBC, 2016 క్రింద గోయింగ్ కన్సర్న్‌గా మరియు SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(4) ప్రకారం సంబంధిత రూల్స్ 8(6) & 9 తో చదవబడే సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 ప్రకారం విక్రయం కోసం ఇ-వేలం అమ్మకపు ప్రకటన

కార్పొరేట్ డెటార్: M/s.ఎతినిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు)
వ్యక్తిగత హామీదారులు/తనఖాదారులు: శ్రీ తాడిశెట్టి మురళీ మోహన్ మరియు శ్రీమతి వెంకటరమణ
రిజిస్టర్డ్ చిరునామా: డి.నెం.6-23-6/A, జయ టవర్స్, 05 వ లైను, 04 వ క్రాస్ రోడ్డు, అరండల్‌పేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522 002, ఇండియా
లిక్విడేటర్: కాశి శ్రీనివాస్, (IBBI Registration: IBBI/IPA-003/IPA-ICAI-N-000237/2019-2020/12840). సంప్రదించు నెం. +91 8008022887; Email: cirp.ethnictobacco@gmail.com, srinivaskashyap111080@gmail.com
మరియు
సెక్యూర్డ్ క్రెడిటార్స్ తరపున స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచి-2, హైదరాబాద్. శ్రీమతి ఇ.రాధిక, చీఫ్ మేనేజర్, సంప్రదించండి: 8985622824; E-mail: sbi.18359@sbi.co.in

IBC కోడ్, 2016 క్రింద లిక్విడేషన్ ఎస్టేట్‌లో భాగమైన ఆస్తులు లిక్విడేటర్ రూపొందించిన సంబంధిత నిబంధనలతో చదవబడే, IBC కోడ్, 2016 ప్రకారం మరియు సెక్యూర్డ్ క్రెడిటర్స్ అనగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, రిలయన్స్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ మరియు ఇండియన్ బ్యాంక్‌లకు అనుకూలంగా వ్యక్తిగత హామీదారులచే తనఖా పెట్టబడిన M/s.**ఎతిక్స్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్)** భూమి & భవనం విక్రయం కోసం కార్పొరేట్ రుణగ్రహీత మరియు వ్యక్తిగత హామీదారులు / మార్జిన్‌దలర్‌లతో సహా సాధారణ ప్రజానీకానికి ఇ-వేలం విక్రయ నోటీసు ఇవ్వడమైనది మరియు సదరు స్థిరాస్తుల కోసం సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 కింద రూల్స్ 8(6)&9 తో జతచేయబడిన సెక్షన్ 13(4) క్రింద **22-08-2019** తేదీన ఆస్తులు స్వాధీనం చేసుకోబడినవి. ఆస్తులను "ఎక్కడ ఉంది అక్కడే", "ఎలా ఉంది అలాగే", "ఏది ఉందో అదే" మరియు "సహాయం లేకుండా" పద్ధతిలో **22-11-2024** ఇ-వేలం ప్రక్రియలో విక్రయించబడునని తెలియజేయడమైనది. ప్రతిపాదిత ఇ-వేలం వివరాలు ఈ దిగువ పేర్కొనబడినవి.

చరాస్తులు: గుంటూరు జిల్లా, ఈదులపాలెం గ్రామములో 8 ఎకరాల 60 సెంట్లలో నిర్మించిన ఇండస్ట్రియల్ రూఫ్ లోని ప్లాంట్ మరియు మెషినరీ మరియు ఫైనాన్షియల్ ఆస్తులు

స్థిరాస్తులు

వ.నెం.	డాక్యుమెంట్ నెం.	ఆస్తి యజమాని పేరు	విస్తీర్ణము	విస్తీర్ణము
1	విక్రయ దస్తావేజు: 3196/2006 తేది. 17-10-2006 లీజు డీడ్: 246/2010 తేది. 23-01-2010	శ్రీ తాడిశెట్టి మురళీమోహన్ తండ్రి: తాడిశెట్టి నరసింహారావు	5 ఎకరాలు	డి.నెం.5/1, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: తూర్పు:** సర్కారు దొంక; **దక్షిణం:** సర్కారు దొంక (కొండవీడు దొంక); **పడమర:** వనమా వెంకటరత్నం & ఇతరులు; **ఉత్తరం:** సర్కారు దొంక.
2	విక్రయ దస్తావేజు: 4218/2008 లీజు డీడ్: 1372/2009 తేది. 05-06-2009 రెక్టిఫికేషన్ డీడ్: 825/2019 తేది. 14-06-2019	శ్రీమతి తాడిశెట్టి వెంకట రమణ, భర్త: తాడిశెట్టి నరసింహారావు	1 ఎకరం 30 సెంట్లు	డి.నెం.5/1, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: తూర్పు:** తాడిశెట్టి మురళీమోహన్ యొక్క స్థలము బోర్డర్; **దక్షిణం:** సర్కారు దొంక బోర్డర్; **పడమర:** తాడిశెట్టి వెంకట రమణ యొక్క స్థలము బోర్డర్; **ఉత్తరం:** సర్కారు దొంక బోర్డర్.
3	విక్రయ దస్తావేజు: 3507/2006 తేది. 22-11-2006 లీజు డీడ్: 1373/2009 తేది. 05-06-2009 రెక్టిఫికేషన్ డీడ్: 1826/2019 తేది. 14-06-2019	శ్రీమతి తాడిశెట్టి వెంకట రమణ, భర్త: తాడిశెట్టి నరసింహారావు	2 ఎకరాలు	డి.నెం.5/1, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: ఉత్తరం:** తాడిశెట్టి మురళీమోహన్ యొక్క స్థలము బోర్డర్; **దక్షిణం:** సర్కారు దొంక (కొండవీడు దొంక); **తూర్పు:** వనమా వెంకటరత్నం; **పడమర:** సర్కారు దొంక.
4	విక్రయ దస్తావేజు: 504/2009 తేది. 25-09-2009 లీజు డీడ్: 4827/2010 తేది. 27-09-2010	శ్రీ తాడిశెట్టి మురళీమోహన్ తండ్రి: తాడిశెట్టి నరసింహారావు	30 సెంట్లు	డి.నెం.744, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: ఉత్తరం:** తాడిశెట్టి మురళీమోహన్‌కు చెందిన స్థలము; **దక్షిణం:** సర్కారు దొంక; **తూర్పు:** సర్కారు దొంక; **పడమర:** సర్కారు దొంక.

పైన పేర్కొన్న మొత్తం నాలుగు ఆస్తులు వెరశి 8 ఎకరాల 60 సెంట్ల భూమి మరియు అందులో 2,92,038 చ॥అ॥ నిర్మాణపు ఏరియాలోని భవనములు, ఇండస్ట్రియల్ షెడ్స్‌తో సహా

రిజర్వుధర:	రూ.50,35,00,000/- (యాభై కోట్ల ముప్పై ఐదు లక్షల రూపాయలు)
డిపాజిట్ చేయవలసిన బయానా:	రూ.5,03,50,000/- (ఐదు కోట్ల మూడు లక్షల యాభై వేల రూపాయలు)
అర్హత పొందిన డాక్యుమెంట్లు సమర్పించుటకు చివరి తేది:	04-11-2024
సైట్ సందర్శన మరియు సమాచారాన్ని పంచుకోవడం	06-11-2024 నుండి 13-11-2024
బయానా దాఖలుకు చివరి తేది:	20-11-2024
ఇ-వేలం తేదీ మరియు సమయం:	22-11-2024 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ వరకు
బిడ్ పెంపుదల మొత్తం	రూ.10 లక్షల మల్టిపుల్‌తో

గమనిక:
1) ఆస్తులు ఉమ్మడిగా విక్రయించబడతాయి మరియు వ్యక్తిగత ఆస్తుల కోసం వేలం అనుమతించబడవు.
2) ఎతినిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ మరియు ఇండ్ టాబ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్లు స్థాపించబడిన ఆస్తులు. భూమి, భవనాలు మరియు ప్లాంట్ మరియు యంత్రాలు ఒకే ప్రాంగణంలో సాధారణ కాంపౌండ్ వాల్‌తో ఉన్